క్లుప్తంగా

కర్ణాటక ఎమ్మెల్యేల పర్యటన

పాలమూరు: మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పర్యటనలో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని కుష్టిగి ఎమ్మెల్యే దొడ్డన్నగౌడ శనివారం పాలమూరుకు వచ్చారు. పలు కాలనీలు, గ్రామాల్లో ఆయన వారం రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి స్వాగతం పలికారు.

జడ్చర్ల: కర్ణాటకలోని షికారిపుర నియోజకవర్గం ఎమ్మెల్యే విజయేంద్ర యడ్యూరప్ప ఆదివారం జడ్చర్లకు విచ్చేస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర నాయకత్వం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యే హాజరువుతుండడంలో భాగంగా ఇక్కడకు విచ్చేస్తున్నట్లు వివరించారు.

పండుగ సాయన్న విగ్రహానికి విరాళం

నవాబుపేట: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పండుగ సాయన్న కాంస్య విగ్రహానికి పోమాల్‌కి చెందిన ముదిరాజ్ సంఘం ద్వారా రూ. 50 వేలు విరాళం అందించారు. ముదిరాజ్ సంఘం నాయకులు సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులుకు నగదు ఇచ్చారు. నరేష్, బీమయ్య, రమేష్, చంద్రయ్య ఉన్నారు.

నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆదివాసీ కాంగ్రెస్ మహబూబ్‌నగర్ మండల అధ్యక్షుడిగా తులసీరాం నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ నియామకపత్రం జారీ చేశారు.

టీవీ వితరణ

భూత్పూర్: మున్సిపాలిటీలోని మిత్యాతండా ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకారంతో టీవీ వితరణ చేయగా మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ ప్రారంభించారు. విద్యార్థులకు దూరదర్శన్ ద్వారా వచ్చే విద్యాబోధన అందేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు.

పశువులకు నట్టల నివారణ మందు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వీరన్నపేటలోని పశువైద్యశాల ఆవరణలో శనివారం పశువులకు గాలికుంటు నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా 14వ వార్డు కౌన్సిలర్ ఎ.అంజయ్య మాట్లాడుతూ పశువులకు కచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలని రైతులు, కాపరులకు సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డా.నరేందర్‌యాదవ్, జేవీఓ చందర్, వీఏలు అరుణ, మస్తాన్, ఓఎస్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలకు ఆటంకం లేకుండా చూడాలి

గండీడ్: గ్రామాల్లో వైద్యసేవలకు ఆటంకం కలగకుండా చూసుకోవాలని గండీడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏఎన్‌ఎంలు ధర్నాలో ఉన్నారని ఈ నేపథ్యంలో సేవలకు ఎలాంటి ఆటంకం రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీహెచ్‌ఓ రామునాయక్, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, సూపర్‌వైజర్ శాంతమ్మ, రెగ్యులర్ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఊడిన ట్రాక్టర్ టైర్ తప్పిన ప్రమాదం



జడ్చర్ల: స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలో 167వ నంబర్ జాతీయరహదారిపైకి సమీప కాలనీ సర్వీస్ రోడ్డు నుంచి వస్తున్న ఓ ట్రాక్టర్ ముందు టైరు ఆకస్మికంగా ఊడిపోయింది. ఈ క్రమంలో త్రుటిలో ప్రమాదం తప్పిపోయింది. జాతీయరహదారిని అనుసరించి అటు ఇటుగా నిర్మిస్తున్న పైపులైన్ రాకపోకలకు అడ్డుగా మారిన నేపథ్యంలో ట్రాక్టర్‌ను నెమ్మదిగా పైపులైన్ మీదుగా తీసుకెళ్తున్న సమయంలో ఘటన చోటుచేసుకుంది. దీంతో ట్రాక్టర్ అక్కడే ఆగిపోయిందని స్థానికులు తెలిపారు.

పరామర్శ

అడ్డాకుల: కన్మనూర్ కి చెందిన విద్యార్థిని(15) ఇటీవల అనారోగ్యానికి గురై వనపర్తి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతి పట్ల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రూ.10వేలను పంపించారు. బాధిత కుటుంబానికి స్థానిక నాయకులు అందజేశారు. పెద్దమందడి మండలాధ్యక్షుడు వేణుయాదవ్, ఎంపీటీసీ గణేష్, ఉపసర్పంచ్ రాజవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

లడ్డూవేలం

జడ్చర్ల టౌన్: విశ్వశాంతి యాగమహోత్సవంలో శనివారం రాత్రి జరిగిన వేలంలో రూ.2.20 లక్షలకు పట్టణానికి చెందిన పాలాది రమేష్ నవీన దంపతులు లలడ్డు దక్కించుకున్నారు. వారికి కృష్ణజ్యోతి స్వరూపానంద ఆశీర్వచనం ఇచ్చి లడ్డు అందజేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



జడ్చర్లలో 5కే రన్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు



దేవరకద్రలో..

జడ్చర్ల: ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం జడ్చర్లలో ఓటర్లను చైతన్య పరిచారు. ఇందులో భాగంగా 5కే రన్‌ను నిర్వహించారు. స్థానిక బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల నుంచి 167వ నంబర్ జాతీయరహదారిపై పత్తి మార్కెట్ యార్డు వరకు పరుగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన వారందరు ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ఓటు హక్కును సద్వినియోగ పర్చుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐలు రమేశ్‌బాబు, జములప్ప, ఎంఈఓ మంజులాదేవి, తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో శనివారం 5కే ర్యాలీ నిర్వహించారు. దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించడం కోసం కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీలు రహమాన్, శివరాజు, ఏఈ కురుమూర్తి, హెచ్ ఎమ్ చంద్రకళ, ఎస్ఐ వెంకటేశ్, ఈఓ సీత్యానాయక్, నాయకులు జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్, బాల్‌రాజు, ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, బాల్‌రాం, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్స్‌పై అవగాహన



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని కావేరమ్మపేట 1, 2 వార్డుల్లో ఎన్నికల అధికారి గోపినాథ్ ఆధ్వర్యంలో బూత్‌లెవల్ అధికారులు ఈవీఎం, వీవీపాట్స్‌లపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటును ఎలా వేయాలో వివరించారు. ఓటుపై భరోసా కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కౌన్సిలర్ బుక్క మహేష్, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గజలమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

బాలానగర్: పెద్దాయపల్లిలో శనివారం గజలమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ శంకరప్ప, గ్రామ పెద్దలు అమ్మవారి ఆలయాన్ని మామిడి, వేప తోరణాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం డప్పు వాయిద్యాలతో గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గండీడ్: ఆయా పథకాల కింద అర్హులందరికీ పథకాలు వర్తింపచేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు ప్రభునాయక్ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కొంతమందికి మాత్రమే ఇస్తున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ విస్తారక్ నర్సిములు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరహరిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆలేటి నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

భూత్పూర్: మద్దిగట్లకి చెందిన కేసిరెడ్డి జలంధర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, జంగిరెడ్డి తదితరులు మండల పార్టీ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలో గ్రామకమిటీ అధ్యక్షుడిగా అధ్యక్షుడిగా మల్లయ్య, ఉపాధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సేవదళ్ రాష్ట్ర నాయకులు అన్వర్ పాష, మాజీ సర్పంచ్ కుమ్మరి చంద్రయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



శంకుస్థాపన చేస్తున్న నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం కేసీఆర్ మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలో మంజూరైన రూ. 1.86కోట్లతో కస్తూర్బాగాంధీ కళాశాల భవన నిర్మాణానికి, రూ.60లక్షలతో జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎంపీపీ కృష్ణయ్యయాదవ్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధునాతనంగా బస్టాండ్ నిర్మాణం

కోయిల్‌కొండ: మండల్ కేంద్రంలో రూ.50లక్షలతో అధునాతనంగా బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాణ్యతతో నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరారు. బచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, వైస్ఎంపీపీ కృష్ణయ్యయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, కుమ్మరిరాజు, ఆర్యరమేష్, శ్యాంసుందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

అడ్డాకుల: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ యాదవ కమిటీ భవనం చుట్టూ తన సొంత ఖర్చుతో ప్రహరీ నిర్మించడానికి జెడ్పీటీసీ ఎన్.రాజశేఖర్‌రెడ్డి ముందుకు వచ్చారు. ఈ మేరకు శనివారం సర్పంచ్ మంజుల యాదవ్‌తో కలిసి ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయనను యాదవులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి నాయకులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కోయిల్‌కొండ: మండలంలోని బీసీ గురుకుల విద్యార్థులు శివకుమార్, పరుశురామ్ గద్వాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చారని పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయిలోకి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయబృందం విద్యార్థులను అభినందించారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు



గండీడ్: శ్రావణ మాస మొదటి శనివారం ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. మండల పరిధిలోని వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, గోవింద్‌పల్లి, గండీడ్, పగిడ్యాల్, మన్సూర్‌పల్లి, సల్కర్‌పేట్, జిన్నారం తదితర గ్రామాల్లో ప్రజలు ఉపవాస దీక్షలు చేశారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలు చేశారు.

మహమ్మదాబాద్: శ్రావణమాస తొలి శనివారం పురస్కరించుకుని మండల పరిధిలోని పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అందరూ సహకరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎంఓ, ఏఎంఓ



హన్వాడలో..

అడ్డాకుల: పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన తమ పిల్లలతో తల్లిదండ్రులు కొంత సమయం కేటాయించి వారి చదువులపై దృష్టి సారించాలని సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ సూచించారు. మండలంలోని శాఖాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్‌కు వారు హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు దేవకీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల ప్రగతిని ప్రదర్శించారు. ఎఫ్ఎల్ఎన్, వర్క్ బుక్స్‌పై వివరణ ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించారు. సీసీహెచ్‌లకు చీరలను పంపిణీ చేశారు. సర్పంచ్ జయన్నగౌడ్, ఉపాధ్యాయులు సంయుక్తారాణి, కల్పన, నాగలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హన్వాడ: పాఠశాలల్లో విద్యాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ బాల్‌రాజు సూచించారు. శనివారం మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, టంకర ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసీ సమావేశాలు జరిగాయి. ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఈఓ రాజునాయక్, క్లస్టర్ హెచ్ఎం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు

జడ్చర్ల: నక్కలబండ తండా సమీపంలో సర్వే నంబర్ 102/18లోని రెండు ఎకరాల విస్తీర్ణం గల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. సదరు భూమిలో వైకుంఠధామం, కమ్యూనిటీ భవనం, ఇళ్లులేని వారికి స్థలాలు ఇవ్వాలని కోరారు.దీనిపై సమగ్ర విచారణ చేయించి ప్రభుత్వ భూమిని కాపాడే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.కార్యక్రమంలో తండాకు చెందిన మహేశ్, బీమ్లా, శంకర్, వినోద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని వరద పాయసం



అడ్డాకుల: వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన యాదవులు శనివారం వరద పాయసం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి సమీపంలో వెలిసిన రామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో కొత్తకుండల్లో భోజనాలను సిద్ధం చేశారు. అదేవిధంగా బెల్లంతో పాయసం చేసి ప్రధాన ఆలయం చుట్టు ప్రదక్షిణ చేశారు. తర్వాత కోనేరు వద్ద స్వామివారికి నైవేద్యం సమర్పించి వర్షాలు కురవాలని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాచాల ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళి యాదవ్, రమేష్ యాదవ్, గ్రామస్తులు శ్రీనివాస్‌యాదవ్, రాములు తదితరులు ఉన్నారు.

పల్లెల తలరాతలు మారుతున్నాయి



జంగమయ్యపల్లిలో అధికారుల బృందం

నవాబుపేట: గ్రామాల్లో పనులు అద్భుతంగా జరుగుతున్నాయని, దీంతో వాటి తలరాతలే మారుతున్నాయని అడిషనల్ కలెక్టర్ యాదయ్య అన్నారు. శనివారం గురుకుంట, దరిపల్లి, జగమయ్యపల్లి గ్రామాల్లో పల్లెప్రగతి పనులు పరిశీలించారు. జంగమయ్యపల్లిలో చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సర్పంచ్ వెంకటేష్‌ను అభినందించారు.

పంచాయతీ కార్యదర్శులపై పనితీరుపై ఆరా..

పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చేస్తున్న పనులపై అధికారుల బృందం ఆరాతీసింది. తాజాగా వారిని అప్‌గ్రేడ్ చేస్తున్న తరుణంలో అధికారుల బృందం వివిధ రకాల రికార్డులు, ఇతర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్కులు వేస్తున్నారు. శనివారం దరిపల్లి, అమ్మపూర్, జంగమయ్యపల్లి, వెంకటేశ్వరతండా, కొల్లూర్ గ్రామాల్లో కార్యదర్శుల పనితీరుపై ఆరాతీశారు. ఎంపీడీఓ శ్రీలత, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మధురస్మృతుల చిరునామా ఫొటోగ్రఫీ

అడ్డాకుల: మండల కేంద్రంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ఎన్.రాజశేఖర్‌రెడ్డి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మధురస్మృతుల చిరునామా ఫొటోగ్రఫీ అన్నారు. ఫొటోగ్రాఫర్లు మహేష్‌యాదవ్, సుందర్, రవియాదవ్, దాదావలి, రాజరత్నం, నవీన్ యాదవ్, భాస్కర్‌గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, రమేష్, స్థానిక తదితరులు ఉన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, సభ్యులు నాగరాజు, శ్రీను, వెంకటేష్, శేఖర్, చంద్రమౌళి, సూరి పాల్గొన్నారు.

దేవరకద్ర: మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణకు మండల ఫొటోగ్రాఫర్స్ అందరు కలిసి రూ. 12 వేల ఆర్థికసాయం, సరుకులు అందించారు. రవీందర్‌రెడ్డి, రఘువీర్,నారాయణ, బాలు, రాము, పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు అప్పడే మరమ్మతులు





కలెక్టరేట్‌లో నీళ్లు కారుతున్నచోట సిమెంట్‌తో మరమ్మతు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కొత్త కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభమై 8 నెలలు గడవక ముందే మరమ్మతులు చేపడుతున్నారు. గతేడాది డిసెంబర్ 4న కలెక్టరేట్ భవనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం ముందు భాగంలో వర్షం నీరు ఉసిరింది. ముసురు వర్షాలకు నీరు కారడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పనులను ఆర్అండ్‌బీ అధికారులు సరిగ్గా పర్యవేక్షించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో హుటాహుటిన అధికారులు స్పందించి కలెక్టరేట్ భవనం ముందు, వెనుక భాగంలో మరమ్మతులు చేపడుతున్నారు. వారం రోజులుగా సిమెంట్ పనులు కొనసాగుతున్నాయి. నీరు కారుతున్న విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా.. కలెక్టరేట్ భవనం రెండు విభాగాలుగా ఉందని, రెండింటి మధ్య గ్యాప్ ఉండటంతో నీరు కారుతుందని ఆర్అండ్‌బీ ఈఈ స్వామి తెలియజేశారు.

18 మంది వార్డు ఆఫీసర్ల నియామకం

జడ్చర్ల: మున్సిపాలిటీలో శనివారం 18 మంది వార్డు ఆఫీసర్లు నియామకం అయ్యారు. ఇటీవల వీఆర్ఏల సర్దుబాటులో భాగంగా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 27 వార్డులు ఉండగా ఇప్పటికే 10 మంది వీఆర్ఓలను వార్డు ఆఫీసర్లుగా గతంలోనే సర్దుబాటు చేశారు. కాగా ఔట్ సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

గృహలక్ష్మిపై ఇంటింటి సర్వే



దేవరకద్ర/బాలానగర్: దేవరకద్రలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకున్న వారికి సంబంధించి శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈఓ సీత్యానాయక్ ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. అలాగే బాలానగర్ మండలం మొదంపల్లి, ఏడుగుట్టల తండాల్లో సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణారావు, గ్రామ కార్యదర్శితో కలిసి వివరాలు సేకరించారు.